సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం। 7। ఫిబ్రవరి। 2024



గంజాయి స్మగ్లర్ల అరెస్టు

గంజాయిని తరలిస్తున్న ఒడిశాకు చెందిన నలుగురు స్మగ్లర్లను ముంచంగిపుట్టు పోలీసులు అరెస్టు చేశారు. 8లో



క్రీడల్లోనూ ప్రోత్సహిస్తాం

ఆశ్రమ విద్యార్థినులను విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహిస్తామని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే పేర్కొన్నారు. 8లో



విరాళాల స్వీకరణకు ఆన్‌లైన్ కౌంటర్లు

8లో

విరాళాల స్వీకరణకు ఆన్‌లైన్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు.

న్యూస్‌రీల్

9న పాడేరులో జాబ్ డ్రైవ్

పాడేరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతవతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 9న ఇండస్ట్రీ కస్టమైజ్డ్ ట్రైనింగ్ జాబ్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రశాంత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి డెక్కన్ ఫైన్ కెమికల్స్ ప్రతినిధులు హాజరవుతారన్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ అర్గానిక్ కెమిస్ట్రీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ పూర్తి చేసిన 27 ఏళ్ల లోపు నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జాబ్ డ్రైవ్‌కు వచ్చే అభ్యర్థులు స్కిల్ యూనివర్స్.ఏపీఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9398338105 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

అడిషనల్ ఎస్పీ అనిల్ పులిపాటికి సత్కారం



అడిషనల్ ఎస్పీ అనిల్ పులిపాటిను సన్మానిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

పాడేరు : జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీగా పని చేసిన అనిల్ పులిపాటి సేవలు మరువలేనివని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. ఆయనకు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి బదిలీ అయిన సంగతి తెలిసిందే. దీంతో మంగళవారం జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ అనిల్ పులిపాటి విధుల పట్ల అంకిత భావం, నీతి నిజాయితీతో విధులు నిర్వహించారన్నారు. బదిలీపై వెళ్తున్న ఎస్‌బీ సీఐ ఎల్. హిమగిరి, డీసీఆర్‌బీ సీఐ నారాయణరావు, ఎస్ఈబీ సీఐ తిరుపతిరావు, సిబ్బంది పి. అనిల్‌కుమార్ అందించిన సేవలను కొనియాడారు. అనంతరం వారిని ఎస్పీ సన్మానించారు. జిల్లా పోలీస్ శాఖ అధికారులు, కార్యాలయ పరిపాలన విభాగం అధికారులు పాల్గొన్నారు.

మల్లుదొర మనవడికి అస్వస్థత

- రాజేంద్రపాలెం ఆస్పత్రిలో చికిత్స



రాజేంద్రపాలెం ఆస్పత్రిలో చికిత్స పొందుతోన్న బోడిదొర

కొయ్యూరు: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు గాం మల్లుదొర మనువడు గాం బోడిదొర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను స్వగ్రామం లంకవీధి నుంచి రాజేంద్రపాలెం ఆస్పత్రికి తీసుకువచ్చారు. బీపీ మాత్రల డోస్ ఎక్కువ కావడమే ఇందుకు కారణమని వైద్యాధికారి మనోజ్ తెలిపారు. కొద్దిరోజులపాటు ఆ మాత్రలు వాడవద్దని ఆయన సూచించారు. ఇలావుండగా బోడిదొర భార్య అచ్చియ్యమ్మ మూడేళ్లక్రితం మృతి చెందడంతో అప్పటినుంచి కూతురు అమ్మన్న వద్ద ఉంటున్నారు.

టెండర్ల ప్రక్రియ గడువు పొడిగింపు

చింతూరు: స్వయం సహాయక సంఘాల అభ్యర్థన మేరకు ఆహార సరఫరా టెండర్ల ప్రక్రియ గడువును పొడిగించినట్టు చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎటపాక యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటీసీ)లో ఐటీడీఏ ఆధ్వర్యంలో స్వల్పకాలిక శిక్షణ పొందుతున్న గిరిజన యువతకు ఆహారం సరఫరా నిమిత్తం ఈనెల మూడు వరకు టెండర్లు ఆహ్వానించినట్టు ఆయన తెలిపారు. కాగా నాలుగు మండలాలకు చెందిన స్వయం సహాయక సంఘాల అభ్యర్థన మేరకు టెండర్ల గడువు ప్రక్రియను ఈనెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పొడిగించినట్టు ఆయన పేర్కొన్నారు. దాఖలైన టెండర్లను ఈనెల 13వ తేదీన ఉదయం 10 గంటలకు తెరవబడునని, నిర్ణీత గడువు అనంతరం వచ్చిన టెండర్లను స్వీకరించబోమని పీవో పేర్కొన్నారు. ఈనెల ఏడు నుంచి స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో రూ.100 చెల్లించి టెండరు ఫారాలు పొందవచ్చని ఆయన సూచించారు. ఆహార సరఫరాకు ఆరు నెలల కాలపరిమితితో అగ్రిమెంటు చేయడం జరుగుతుందని పీవో వెల్లడించారు.

ఏజెన్సీలో కార్పొరేట్ వైద్యం

- పాడేరు ఆస్పత్రిలో మేజర్ శస్త్ర చికిత్సలు చేసే స్థాయిలో సౌకర్యాలు
- విజయవంతంగా 569 మేజర్, 5,457 మైనర్ ఆపరేషన్లు
- సర్కారు వైద్యంపై గిరిజనుల్లో పెరుగుతున్న విశ్వాసం



పాడేరు జిల్లా ఆస్పత్రిలో శస్త్రచికిత్సలో నిమగ్నమైన వైద్య నిపుణులు (ఫైల్)

సాక్షి,పాడేరు: గత పాలకులు గిరిజనుల ఉన్నత వైద్యాన్ని నిర్లక్ష్యం చేశారు.గిరిజనులు సీజనల్ వ్యాధులతో పాటు ఇతర అనారోగ్య సమస్యలకు గురై వ్యాధి నిర్ధారణకు కూడా దిక్కులేని పరిస్థితి ఉండేది. స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచి సూది మందు తప్ప ఉన్నత వైద్యానికి నోచుకోని పరిస్థితి. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గత 18 నెలల నుంచి పాడేరు జిల్లా ఆస్పత్రిలో అన్ని విభాగాల్లో శస్త్రచికిత్సలు విజయవంతంగా జరుగుతున్నాయి.

గత ప్రభుత్వంలో ప్రచారానికే పరిమితం

చంద్రబాబు హయాంలో 200 పడకల జిల్లా స్థాయి ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ కేవలం బోర్డుకే పరిమితమైంది. కనీసం వైద్య నిపుణులను కూడా నియమించలేదు. అత్యవసర వైద్యం కోసం రోగులను కేజీహెచ్‌కు తరలించేవారు. అక్కడికి తీసుకువెళ్లే లోపు కొన్ని సందర్భాల్లో మార్గం మధ్యలోనే ప్రాణాలు పోయేవి. జిల్లా ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ నిరుపయోగంగా ఉండేది. ఈ పరిస్థితుల్లో అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మన్యంలో వైద్యసేవలపై దృష్టి సారించారు. అంచెలంచెలుగా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించారు. అవసరమైన వైద్య నిపుణులను నియమించడంతో అత్యవసర వైద్యం అందుబాటులోకి వచ్చింది. క్షతగాత్రులకు అవసరమైన శస్త్రచికిత్సలు చేస్తున్నారు.

- 2022లో మేజర్, మైనర్ ఆపరేషన్లు ఆరు వేల వరకు జరిగాయి. 2023 జనవరి నుంచి డిసెంబర్ నెల వరకు మేజర్ 568, మైనర్ 5457 శస్త్ర చికిత్సలు చేశారు. 2,324 ప్రసవాలు జరగ్గా 99మంది గర్భిణులకు శస్త్రచికిత్సల ద్వారా కాన్పులను విజయవంతంగా నిర్వహించారు. కుటుంబ సంక్షేమానికి సంబంధించి 337 ట్యూబెక్టమి, 77 వెసెక్టమి ఆపరేషన్లను జిల్లా ఆస్పత్రిలో విజయవంతంగా నిర్వహించారు. ఈఏడాది జనవరిలో 36 మేజర్,70 మైనర్ ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించారు.

సీఎం జగనన్నకు రుణపడి ఉంటా



వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పాడేరు జిల్లా ఆస్పత్రిలోమేజర్ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. కాలినొప్పితో బాధపడుతున్న తాను ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తే ఆపరేషన్‌కు రూ.5 లక్షలు అవుతుందని తెలిపారు. వెంటనే పాడేరు జిల్లా ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించా. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా శస్త్రచికిత్స చేశారు. ఎటువంటి ఖర్చులేకుండా చేసేలా అత్యాధునిక వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటా.

– సిరికోట్ల ఆనంద్,
టిఫెన్ కొట్టు, పాత బస్టాండ్, పాడేరు

రిఫరల్ కేసులు తగ్గించాం



జిల్లా ఆస్పత్రిలో అన్ని రకాల శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నాం.అనుభవజ్ఞులైన వైద్యనిపుణులు, జనరల్ ఫిజీషియన్లు ఉన్నారు. ఆరోగ్యశ్రీ ఆపరేషన్లు చేసే స్థాయిలో ఉన్నత వైద్యం జిల్లా ఆస్పత్రిలో అందుబాటులోకి రావడం గిరిజన ప్రాంత ప్రజల అదృష్టం. ప్రమాదాలు జరిగే సమయంలో విరిగిన ఎముకలకు సకాలంలో శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. ప్రసవాలకు ఉన్నత వైద్యం అందుబాటులోకి వచ్చింది. కేజీహెచ్, కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫరల్ కేసులు బాగా తగ్గించాం

– డాక్టర హేమలతాదేవి,
ప్రిన్సిపాల్, వైద్య కళాశాల, పాడేరు

సాగులో డ్రోన్ల వినియోగం పెంపునకు కృషి

అటారీ డైరెక్టర్ డైరెక్టర్ మీరా



పందిరిమామిడి కోటలో రబ్బరు యూనిట్లను పరిశీలిస్తున్న అటారీ డైరెక్టర్ మీరా

రంపచోడవరం: రానున్న ఐదేళ్ల కాలంలో రైతులు వ్యవసాయం చేసేందుకు డ్రోన్లు వినియోగించే స్థాయికి తీసుకువచ్చేందుకు భారత వ్యవసాయ పరిశోధన, వ్యవసాయ సాంకేతిక సంస్థ కృషి చేస్తుందని అగ్రికల్చర్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (అటారీ) డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్. మీరా అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటై 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పందిరి మామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో ఆయన ‘సాక్షి’తో మాట్లాడారు. తెలంగాణ, ఆంధ్రా, తమిళనాడు, పాండిచ్చేరిలో తమ పరిధిలో 72 కేవీకేలు ఉన్నట్టు ఆయన తెలిపారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ వినియోగం కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. రైతుల ముంగిట్లోకి డ్రోన్‌లను తీసుకువెళ్లేందుకు నమో డ్రోన్ దీదీ ద్వారా 15 వేల మందిది గ్రామీణ నిరుద్యోగ మహిళలకు డ్రోన్స్ వినియోగంపై శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. రైతులకు డ్రోన్‌లను అందుబాటులోకి తెచ్చేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అగ్రి డ్రోన్ ప్రాజెక్టు ఫేజ్–2లో గ్రూపులుగా ఏర్పడిన రైతులకు 50శాతం రాయితీలపై డ్రోన్లు పొందేందుకు అవకాశం ఉందన్నారు. మూడేళ్లలో మారుతున్న వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు నూతన ఆవిష్కరణలను రైతుల ముందుకు తీసుకువెళ్లామన్నారు. భారతదేశంలో నూనె గింజల ఉత్పాదకను గణనీయంగా పెంచేందుకు దేశవ్యాప్తంగా చర్యలు చేపట్టామన్నారు. వ్యవసాయాన్ని లభాసాటిగా మార్చి, ఆదాయ వనరులను పెంపొందిస్తామన్నారు. ఆర్య ప్రాజెక్టు ద్వారా యువ రైతులు ఒక్క రూపాయి పెట్టుబడి పెడితే రూ. 10.80లు ఆదాయం వచ్చిందన్నారు. ఏజెన్సీలో గిరిజన రైతులు రబ్బరు సాగుపై ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో టీఎస్‌పీ ద్వారా రబ్బరు రైతులకు అందించిన రబ్బరు ప్రాసెసింగ్ యూనిట్లు, స్మోక్‌రూమ్‌లు, రోలింగ్ మెషీన్లు పరిశీలించినట్టు చెప్పారు. రానున్న కాలంలో రబ్బరు రైతులకు పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా మరింత చేయూత నిచ్చేలా కసరత్తు జరుగుతుందన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి నిధులు

- రూ.50 లక్షలు మంజూరు



కొలతల నిమిత్తం ఆలయానికి విచ్చేసిన ఎండోమెంట్ అధికారులు

సీలేరు : మండలంలో ప్రాచీన పుణ్యక్షేత్రమైన ధారకొండ ధారాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి ఎండోమెంట్ అధికారులు శ్రీకారం చుట్టారు. అరవై ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ఆలయ మండపం , గర్భగుడి పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసింది. ఈ మేరకు మంగళవారం ఎండోమెంట్ అధికారులు డీఈ కృష్ణ ఏఈ శివప్రసాద్, ఈవో సాంబశివరావు, కాంట్రాక్టర్ నాయుడు కొలతలు వేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజు, ఆలయ కమిటీ సభ్యులు గణేశ్వరరావు, సుంకర విష్ణుమూర్తి పాల్గొన్నారు.

గోమంగి మినీ గురుకుల హెచ్‌ఎం సరెండర్


పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశాలు



గోమంగి మినీ గురుకులంలో విద్యార్థులతో మాట్లాడుతున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

పెదబయలు: మండలంలోని గోమంగి మినీ గురుకులం హెచ్‌ఎం వి.చంద్రకళను ఐటీడీఏకు సరెండర్ చేయాలని పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఆదేశించారు. మంగళవారం మండలంలో పర్యటించిన ఆయన గోమంగిలోని మినీ గురుకులం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. మినీ గురుకులంలో హెచ్‌ఎం వి.చంద్రకళ విధులకు హాజరు కావడం లేదని గుర్తించిన పీవో షోకాజ్ నోటీసులు జారీ చేసి సరెండర్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గురుకులంలో మెనూ అమలను విద్యార్థుల నుంచి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. గురుకులంలో ఒకటో తరగతి విద్యార్థులకు తెలుగు పాఠ్యాంశం, ఏడవ తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రం,ఆరో తరగతి విద్యార్థులకు గణిత శాస్త్రాన్ని బోధించారు. విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని ఉపాధ్యాయులను సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్యసేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి రికార్డులు, మందుల నిల్వలపై అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను సూచించారు.

మాదిగలను వాల్మీకులుగా గుర్తించాలని వినతి



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాదిగలు

సాక్షి,పాడేరు: ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో పూర్వం నుంచి జీవిస్తున్న తమను ఎస్టీ వాల్మీకులుగా గుర్తించి తగిన న్యాయం చేయాలని మాదిగలు కలెక్టర్ సుమిత్ కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. తొలుత పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్‌ల పరిధిలోని వారంతా పాడేరులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను తెలియజేశారు. ఇంటలెక్చువల్ ఫోరం ఫర్ మాదిగల సంఘ అధ్యక్షుడు గడ్డం బాపిరాజు మాట్లాడుతూ 300 సంవత్సరాల క్రితం నుంచి మాదిగలు గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్నారన్నారు. బ్రిటీష్ పాలకులు కొండమాదిగలుగా తమను గుర్తించారని కలెక్టర్‌కు తెలిపారు.ఆ తరువాత భారత ప్రభుత్వం ఈ ప్రాంతంలో నివసిస్తున్న ఆరు కులాలను ఎస్టీ వాల్మీకులుగా గుర్తించారని, మాదిగలకు మాత్రం అన్యాయం జరిగిందన్నారు. ఈవిషయాన్ని ప్రభుత్వం దృష్టికి సమస్య పరిష్కరించేలా కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాదిగ ప్రజా సంఘాల నేతలు ఎం.పిచ్చయ్య, పింగిలి విజయ్‌కుమార్, వేమగిరి మునలిబాబు, దారాబాబు, చింతాడ జయలక్ష్మి, ఎత్తుల దామోదర్, చిన్నం నాగేశ్వరరావు, గడ్డం సోమరాజు, వేమగిరి అర్జున్ పాల్గొన్నారు.

ఉద్యోగాల ఇంటర్వ్యూలకు విశేష స్పందన



మాట్లాడుతున్న చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్



ఇంటర్వ్యూలకు హాజరైన విద్యార్థినులు

చింతపల్లి రూరల్: గిరిజన విద్యార్థినులు ఆర్థికంగా స్థిరపడాలన్న సంకల్పంతో నిర్వహించిన ఉద్యోగాల ఇంటర్వ్యూలకు విశేష స్పందన లభించిందని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్ అన్నారు. మండలంలో ప్రేరణ కార్యక్రమంలో భాగంగా వైటీసీ కేంద్రంగా ప్రశాంతి పాలిటెక్నిక్ ఆధ్వర్యంలో పోలీసుశాఖ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చింతపల్లి, గూడెం, కొయ్యూరు మండలాల నుంచి సుమారు 500 మంది విద్యార్థినులు హాజరయ్యారు. వీరిలో సుమారు 350 మంది అర్హత సాధించినట్టు ఏఎస్పీ తెలిపారు. టాటా ఎలక్ట్రానిక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ నెల 8న పాడేరులో, 10న రంపచోడవరం ,12న చింతూరులో ఇంటర్వ్యూలు జరుగుతాయని ఆయన తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, టాటా కంపెనీ సిబ్బంది గోపకుమార్, ప్రవీణ్‌కుమార్, సీఐలు రమేష్, అశోక్‌కుమార్, ఎస్ఐలు వెంకట రమణ, అప్పలసూరి పాల్గొన్నారు.

గిరి రైతుల నుంచి జాఫ్రా కొనుగోలు

- సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు రక్త పరీక్షలు
- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



సమావేశంలో మాట్లాడుతున్న పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలో గిరిజనులు రైతులు పండించే జాఫ్రాను వెలుగు ఆధ్వర్యంలో కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం వెలుగు, జీసీసీ, ఉద్యాన అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన రైతులు పండించే పంటలకు గిట్టుబధర కల్పించడంతో పాటు దళారుల చేతుల్లో మోసపోకుండా ఉండేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది వెలుగు ద్వారా కొనుగోలు చేసిన జాఫ్రా, చింతపండు, పసుపు వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు.ఈ ఏడాది ఎక్కువ స్థాయిలో కొనుగోలు చేయాలని అధికారులను సూచించారు. ఈ సమావేశంలో జీసీసీ డీఎం పార్వతీశ్వరరావు, పీహెచ్‌వో చిట్టిబాబు, పీఏవో రాంబాబు, వెలుగు ఏపీడీ శ్రీనివవాసరావు, జీసీసీ సీనియర్ మేనేజర్లు మూర్ల నాగవెంకటరాజారెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైద్యాధికారులతో..

ఏజెన్సీలో సికిల్ సెల్ ఎనిమియా బాధితులను గుర్తించేందుకు రక్త నమూనాలు సేకరించాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరం నుంచి పీహెచ్‌సీ వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో 2,18,385 మంది జనాభా ఉన్నరని తెలిపారు. 18 పీహెచ్‌సీల పరిధిలో ప్రతీ ఇంటికి వెళ్లి సికిన్ సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించేందుకు 79,425 కిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. పీహెచ్‌సీల వారీగా నిర్వహించిన రక్తపరీక్షలు, అప్‌లోడ్ వివరాలు తెలుసుకున్నారు. సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు ప్రకారం పింఛను ఇస్తుందన్నారు. గర్భిణులకు సంబంధించిన వివరాలు పీవో తెలుసుకున్నారు. ఏడీఎంహెచ్‌వో ప్రకాశం పాల్గొన్నారు.

దట్టంగా పొగమంచు



పాడేరు ఘాట్‌లో కురుస్తున్న పొగమంచు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 9గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. ఘాట్ ప్రాంతాల్లో పొగమంచు కారణంగా లైట్ల వెలుగులో వాహనాలు నడుపుతున్నారు.పాడేరు మండలం మినుములూరులో మంగళవారం 10డిగ్రీలు నమోదైంది. అరకులోయలో 16.3డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం వద్ద 17 డిగ్రీలు నమోదైందని సంబంధిత అధికారవర్గాలు తెలిపాయి. చలిగాలుల ప్రభావం ఉంది.

తాడేపల్లిగూడెంకు అప్పన్న ప్రచార రథం



రథాన్ని ప్రారంభిస్తున్న ఏఈవో భ్రమరాంబ, పాల్గొన్న అర్చకులు, సిబ్బంది

సింహాచలం : హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన ప్రచార రథం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు మంగళవారం తరలివెళ్లింది. బుధవారం నుంచి 10వ తేదీ వరకు తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల్లో రథం ద్వారా హిందూ ధర్మప్రచారాన్ని నిర్వహిస్తారు. 11వ తేదీన తాడేపల్లిగూడెంలో ఉన్న బలుసమ్మ దేవాలయంలో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. రథానికి ఏఈవో భ్రమరాంబ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. దేవస్థానం అర్చకులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆ మాటే స్ఫూర్తి మంత్రం



ప్రసంగిస్తున్న మోటివేషనల్ స్పీకర్ నిక్

- యువతలో ఉత్తేజం నింపిన నిక్ ప్రసంగం
- ఆద్యంతం సందేశాత్మకం



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

ఏయూక్యాంపస్: జీవిత లక్ష్యాన్ని తెలుసుకోవాలి. జీవితం విలువ గుర్తించాలి. జీవితంలో మనం జీవించాలి. సంపద పెంచుకోవడం కంటే ప్రేమను పంచడం ఎంతో విలువైన అంశం అంటూ యువతకు దిశానిర్దేశం చేశారు ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్. ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల వేదికగా మంగళవారం సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక ప్రసంగం యువతలో కొత్త ఉత్సాహాన్ని, వారిలో నూతన శక్తిని నింపింది. విశ్వనగరంగా మారుతున్న విశాఖలో ఇటువంటి స్ఫూర్తిదాయక ప్రసంగం జరగడం ఇదే తొలిసారి. ఇంతటి మహత్తర కార్యక్రమానికి ఏయూ ఆతిథ్యం అందించి వేదికగా నిలిచింది. వేలాదిమంది విద్యార్థులు ప్రత్యక్షంగా ఈ కార్యక్రమంలో పాల్గొని కొత్త ఉత్సాహంతో వెళ్లారు.

సమయం చూసి నేర్చుకోవాలి

నిక్ ప్రసంగం అంతా సమయ పాలనతో సాగింది. సరిగ్గా సాయంత్రం 6 గంటలకు వేదిక వద్దకు చేరుకున్నారు. కొద్దిసేపు ఏయూ వీసీ ప్రసంగం, ఇతర కార్యక్రమాలను తిలకించారు. అనంతరం 6.20 గంటలకు తన ప్రసంగాన్ని ప్రారంభించి, సరిగ్గా గంట తరువాత 7.20 గంటలకు తన ప్రసంగాన్ని పూర్తి చేశారు. తాను చెప్పాలనుకున్న అంశాన్ని సమగ్రంగా, ఎంతో ఆసక్తిదాయకంగా, స్ఫూర్తిమంతంగా యువతకు అందించారు.

ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం

హ్యూమన్ బీయింగ్ టు బీయింగ్ హ్యూమన్ అంటూ వేలాది మంది విద్యార్థులు ఏకకాలంలో ప్రతిజ్ఞ చేశారు. అధిక సంఖ్యలో యువత ఒకే వేదిక నుంచి ప్రతిజ్ఞను చేసి ఏషియా బుక్ ఆఫ్ రికార్డునుసాధించారు. దీనిని సంస్థ ప్రతినిధి దిలీప్ పాత్రో వేదికపై ప్రకటించి, ధ్రువపత్రాన్ని ఏయూ అధికారులకు అందించారు.

వసుదైక కుటుంబంగా ఏయూ

వసుదైక కుటుంబం అనే సూక్తిని నేడు ఏయూ నిజం చేస్తోందని వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి అన్నారు. ఏయూలో చదువుకున్న విద్యార్థులు విశ్వవ్యాప్తంగా స్థిరపడి ప్రపంచానికి సేవలు అందిస్తున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్‌జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో ఏయూను అభివృద్ధి చేసిన విధానం, దేశంలో అత్యుత్తమ విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దామన్నారు. సిటీ ఆఫ్ డెస్టినీలో ప్రారంభమైన ఏయూ ఎందరో డెస్టినీని మార్చివేసిందన్నారు.

ఆద్యంతం ఆహ్లాదకరం

యువతకోసం తీర్చిదిద్దిన కార్యక్రమం ఆద్యంతం ఆహ్లాదాన్ని, అణువణువునా స్ఫూర్తిని చాటింది. ముందుగా ఏయూ విద్యార్థిని మిస్ సౌత్ ఇండియా 2022 చరిష్మా తన ప్రసంగంతో యువతను ఆకట్టుకుంది. అనంతరం విభిన్నప్రతిభావంతుల యువత నృత్య ప్రదర్శనలు, విశాఖ వ్యాలీ విద్యార్థుల నృత్యం, ఏయూ నృత్య, సంగీత విభాగం విద్యార్థుల శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు, ఏయూ రంగస్థల విభాగం విద్యార్థులు నీరు, వ్యవసాయం విలువను తెలియజేసే మైమ్ ప్రదర్శన, సునీల్ ముప్పల ప్రసంగం విద్యార్థులను కట్టిపడేశాయి. ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని నిక్ చిత్రపటానికి పెన్సిల్‌తో తీర్చిదిద్ది ఆయనకు బహూకరించింది. కార్యక్రమంలో చివరగా వందన సమర్పణ ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ చేశారు. కార్యక్రమంలో ఏయూ ప్రిన్సిపాల్స్, డీన్స్, అధికారులు, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రీడల్లోనూ ప్రోత్సహిస్తాం

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన పీవో

రంపచోడవరం: ఏజెన్సీలోని ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులను విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహిస్తామని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన పరిశీలించారు. ఆశ్రమ పాఠశాలలో కుస్తీ, వివిధ రకాల ఆటల పోటీలను ఆయన తిలకించారు. ఏజెన్సీలోని ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ నిబంధన ప్రకారం మెనూ అమలు చేయాలని సూచించారు. మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు అందిస్తున్నఆహారం, సరఫరా వివరాలను ఆయన తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాలల్లో అన్ని గదులను పీవో పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.

విద్యుత్ తీగలు పడి పశువుల మృతి


జర్రకొండలో మృతి చెందిన పశువులు

హుకుంపేట: మండలంలోని డ్రిపల్లి గ్రామ సమీపంలో మంగళవారం విద్యుత్ తీగలు పడి నాలుగు పశువులు మృతి చెందాయి. జర్రకొండ పంచాయతీ గనిక గ్రామానికి చెందిన పశువులు వాగు వద్ద పొలల్లో మేస్తుండగా వాటిపై విద్యుత్ తీగలు పడడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. తమ పశువులు మృతి చెందడంతో నష్టపోయామని గనిక గ్రామానికి చెందిన మాదేలి చిన్నయ్య, జన్ని నర్సన్న, మజ్జి సోమన్న, పాడి దేముడు ఆవేదన వ్యక్తం చేశారు.

108లో ప్రసవం


ఎఎన్ఎంకు బిడ్డను అందజేస్తున్న 108 సిబ్బంది

మారేడుమిల్లి : మండలంలోని తాడేపల్లి పంచాయతీ పరిధిలోని తౌరమామిడి గ్రామానికి చెందిన టి.మంగమ్మ 108 వాహనంలో ప్రసవించింది. ఆమెకు మంగళవారం పురిటి నొప్పులు రావడంతో బంధువులు 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది ఆమెను అంబులెన్స్‌లో రంపచోడవరం తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు అధికమవడంతో 108 పైలెట్ వెంకట్, ఈఎంటీ శంకర్ ప్రసవం చేశారు. మగబిడ్డకు జన్మనిచ్చిందని, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది తెలిపారు.

దివ్యాంగుల అవసరాలు తీర్చేందుకు చర్యలు

ఆ శాఖ అడిషనల్ డైరెక్టర్ మాధవి


సమీక్ష నిర్వహిస్తున్న దివ్యాంగుల సంక్షేమశాఖ అడిషినల్ డైరెక్టర్ మాధవి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మాధవి

గంగవరం : గిరిజన గ్రామాల్లో దివ్యాంగ బాలల సంక్షేమానికి, వారి అవసరాలను తీర్చేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్టు విశాఖ డిప్యూటీ కలెక్టర్, దివ్యాంగుల సంక్షేమశాఖ అడిషనల్ డైరెక్టర్ జె.మాధవి తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు అధ్యక్షతన దివ్యాంగ బాలలు, తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఆమె దివ్యాంగ బాలలు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. వారి నుంచి సమస్యలు తెలుసుకున్నారు. దివ్యాంగుల సంక్షేమశాఖ అందించే సహకారాన్ని ఆమె వివరించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రతీ మండలంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆమె వివరించారు. ఈ సందర్భంగా గుర్తించిన సమస్యలను ఆయనకు నివేదిస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ సదస్సులో 31మంది దివ్యాంగ బాలలను పరిశీలించినట్టు చెప్పారు. అంతకుముందు ఎంపీడీవో బి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో పీహెచ్‌సీ వైద్యాధికారి భావన, ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్.లక్ష్మి, ఎంఈవో-2 మల్లేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సదస్సులో విశాఖపట్నం ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి కంటి వైద్యులు నవ్యశ్రీ, రీహాబిటేషన్ నిపుణులు ఆర్తి, నీతి అయోగ్ ఏబీఎఫ్ హేమమాధురి తదితరులు పాల్గొన్నారు.

41 మందికి రుణాలు

గంగవరం : విశాఖ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఎన్‌హెచ్ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో 41 మంది దివ్యాంగులకు రూ.1.24 కోట్ల మేర రుణాలు మంజూరు చేసినట్టు ఆశాఖ అడిషనల్ డైరెక్టర్ జె.మాధవి తెలిపారు. మంగళవారం ఇక్కడికి వచ్చిన ఆమె మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని తెలిపారు. దివ్యాంగ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అల్లూరి జిల్లాలో పది, విశాఖ జిల్లాలో 60 మోటారు వాహనాలు అందజేసినట్టు తెలిపారు. ఒకొక్క వాహనం విలువ రూ.లక్ష ఉంటుందన్నారు. ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, పీజీ చదివే విద్యార్థులకు రూ. 30వేల విలువైన 70 లాప్‌టాప్‌లు అందజేశామన్నారు. అర్హులైన విద్యార్థులు టచ్‌ఫోన్లు ఇచ్చామన్నారు. మూడు జాబ్ మేళాలను నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పించడం జరిగిందన్నారు. సీనియర్ సిటజన్స్‌కు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు.

ఆదివాసీలకు కొండంత అండగా సీఎం జగన్


పార్టీ నాయకులతో అరకు అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయ కర్త మత్స్యలింగం

అరకులోయ అసెంబ్లి నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యలింగం

అరకులోయటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గిరిజనులకు కొండంత అండగా ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి సీఎంను చేయాలని ఆ పార్టీ అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త రేగం మత్స్యలింగం అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. అందరూ ఒక తాటిపైకి వచ్చి కలిసికట్టుగా జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని చెప్పారు. గిరిజన ప్రాంతంలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి సాధించాలంటే తప్పకుండా వైఎస్ జగన్ మరోసారి సీఎం కావాలన్నారు. అందుకు బూత్ స్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు కష్టపడి పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు లొక్కోయి లక్ష్మణ్ కుమార్, ఎంపీటీసీలు శత్రుఘ్న, ధరం పూర్ణ, పార్టీ ముఖ్య నాయకులు స్వాభి రామూర్తి, రాంచందూర్, బాలరాజు,ముఖీ సాంబయ్య, కామరాజు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


గ్రామస్తులను విచారిస్తున్న పీవో అభిషేక్


సర్వే రికార్డులను చూపిస్తున్న అభిషేక్

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ హెచ్చరిక

పెదబయలు: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ హెచ్చరించారు. మండలంలోని ఇంజరి పంచాయతీ ఎర్రబయలు గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఎర్రబయలు, వనగరాయి, గొందిపల్లి గ్రామస్తుల మధ్య ఉన్న వివాదంపై విచారణ జరిపారు. భూ వివాదాలుంటే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారించుకోవాలని సూచించారు. ఇళ్లు ధ్వంసం చేస్తే నష్టపరిహారం ఎవరు ఇస్తారని ప్రశ్నించారు.

ఇటువంటి సంఘటనలు జరిగితే 144వ సెక్షన్ అమలు చేస్తామన్నారు. చిన్న సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోయారని గ్రామ పెద్దలను ప్రశ్నించారు. జల్లి కాంతమ్మ,జల్లి నీలమ్మ, కర్రమ్మ,లక్ష్మి, చిన్నమ్మల మధ్య జరిగిన వివాదంపై, హైకోర్టు తీర్పుపై ఆరా తీశారు. ఎర్రబయలు గ్రామస్తులు ఎప్పటి నుంచి భూమి సాగు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. గొందిపల్లి గ్రామస్తులకు ఎటువంటి హక్కులు ఉన్నాయని, ఎందుకు దాడి చేశారని ప్రశ్నించారు. గుడికి భూమిని ఎవరు దానం చేశారని, ఆ భూమి మీద అతనికి ఉన్న హక్కులపై ఆరా తీశారు. చట్టాన్ని సక్రమంగా అమలు చేసి న్యాయం చేస్తామన్నారు. దాడులకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఏఎస్పీ కె.ధీరజ్, మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లర్ల అరెస్టు

- 20 కిలోల గంజాయి, కారు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం
- పరారీలో మరో గంజాయి స్మగ్లర్

ముంచంగిపుట్టు: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఒడిశాకు చెందిన నలుగురు స్మగ్లర్లను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి కారు, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన ముంచంగిపుట్టు మండలం జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు జంక్షన్ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రవీంద్ర వివరాల ప్రకారం.. గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నారని పక్కా సమాచారం రావడంతో మండలంలో జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు జంక్షన్ వద్ద ఉదయం తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బుంగాపుట్టు నుంచి వస్తున్న కారు(ఓడీ 08జే 1818) పోలీసులను చూసి నిలుపుదల చేసి ఐదుగురు పరారయ్యారు. దాంతో వారిని వెంబడించి ఎంతో చాకచక్యంగా నలుగురిని పట్టుకున్నారు. కారును తనిఖీ చేయగా 20 కిలోల గంజాయి లభించింది. గంజాయిని, కారును సీజ్ చేసి ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.60 వేలు ఉంటుందని నిర్ధారించారు. పట్టుబడిన వారిలో ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ పనసపుట్టు గ్రామానికి చెందిన సిబా హంతల్, భీష్మ హంతల్, ఎలంపక గ్రామానికి చెందిన రమేష్ ఖిలా, కడగుమ్మా గ్రామానికి చెందిన మానస్ ఖిలాలుగా గుర్తించారు. కోరాపుట్టు జిల్లా కేంద్రానికి చెందిన మరో గంజాయి స్మగ్లర్ పరారీలో ఉన్నాడని, అతనిని త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు. ఈ తనిఖీలో ముంచంగిపుట్టు ఏఎస్ఐ తిరుపతి, పోలీసులు, హోంగార్డులు నాగేశ్వరరావు, అర్జున్ పాల్గొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విరాళాల స్వీకరణకు ఆన్‌లైన్ కౌంటర్లు

- సింహగిరిపై మూడు కేంద్రాల్లో తొమ్మిది స్వైపింగ్ యంత్రాలు
- సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: సింహగిరిపై భక్తుల సౌకర్యార్థం స్వైపింగ్ మిషన్ల ద్వారా విరాళాలు స్వీకరించేందుకు ఆన్‌లైన్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈమేరకు మంగళవారం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రాష్ట్ర అధికారి ఉదయ్ గుడిపాటి, ఆ బ్యాంకుకు చెందిన పలువురు అధికారులు, దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులతో సమావేశమై చర్చించారు. ఆన్‌లైన్ ద్వారా విరాళాలు స్వీకరించే పద్ధతిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రధాన ఆలయాల్లో ఆన్‌లైన్ ద్వారా విరాళాలు స్వీకరణకు దేవదాయశాఖ కసరత్తు చేస్తోందన్నారు. ఇప్పటివరకు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు నుంచి సింహగిరిపై నగదు రూపంలోను, చెక్కులు, డీడీల రూపంలో స్వీకరించేవాళ్లమన్నారు. భక్తులకు మరింతగా సౌలభ్యం చేకూర్చేందుకు స్వైపింగ్ మిషన్‌ల ద్వారా విరాళాలు స్వీకరించేందుకు ఆన్‌లైన్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తొలివిడతగా అన్నదానం భవనం వద్ద, పీఆర్‌వో కార్యాలయం వద్ద, ఆలయంలోను మూడు చోట్ల తొమ్మిది స్వైపింగ్ మిషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రెండో విడతలో మిగిలిన కేంద్రాల్లో కూడా అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ప్రధానంగా అన్నప్రసాదానికి సంబంధించి శాశ్వత విరాళాలు, స్వల్ప విరాళాలకు సంబంధించి రెండు చోట్ల స్వైపింగ్ మిషన్లు, గో సంరక్షణకు సంబంధించి మరో స్వైపింగ్ మిషన్ కౌంటర్లలో అందుబాటులో ఉంటాయన్నారు. దేవస్థానంతో ఆ యంత్రాలు నేరుగా అనుసంధానమై ఉంటాయని, మూడో పార్టీని ఈప్రక్రియలో అనుమతించబోమని తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ యంత్రాలను ఉచితంగా అందజేస్తుందన్నారు. అలాగే సింహగిరిపై ఏటీఎమ్ కేంద్రాన్ని కూడా త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, పెనుమత్స శ్రీదేవివర్మ, రామలక్ష్మి, రాజేశ్వరి, శ్రీదేవి, ఏఈవో పాలూరి నరసింగరావు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు


ప్రాంతీయ సదస్సుకు హాజరైన ఆరు జిల్లాల వివిధ శాఖల అధికారులు

మహారాణిపేట (విశాఖపట్నం): బాలల హక్కుల పరిరక్షణలో అధికారులంతా భాగస్వాములు కావాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు జంగం రాజేంద్ర ప్రసాద్, గొండు సీతారాం సూచించారు. నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం ఉత్తరాంధ్ర జిల్లాల స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభాగాలు, కార్మిక, విద్య, పోలీస్, వైద్య ఆరోగ్య తదితర శాఖలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ×బాలల హక్కులు, పరిరక్షణ₹పై ప్రాంతీయ స్థాయి సమన్వయ సమావేశం జరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇటీవల కాలంలో నమోదైన బాల కార్మిక కేసులు, ప్రభుత్వం అందిస్తున్న నిధులు, చేపట్టిన చర్యలు, లబ్ధిపొందిన వారి వివరాలపై ఈ సందర్భంగా చైర్మన్ ఆరా తీశారు. ఆరు జిల్లాల్లో రెండేళ్లుగా జరిగిన బాల్య వివాహాల కేసులు, పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు, చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులు, పోక్సో తదితర కేసుల నమోదు, ఆయా కేసుల్లో జన్మించిన పిల్లలకు జనన ధ్రువీకరణపత్రాల జారీ తదితర అంశాలపై చర్చించారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో బాలల హక్కుల ఉల్లంఘనలను అడిగి తెలుసుకున్నారు. బాలల హక్కులు, వారి సంక్షేమంపై ప్రభుత్వ శాఖల సహకారం, అమలులో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారుల వివరాలు సేకరించారు. గిరిజన ప్రాంతాల్లోని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న భోజనం తీరు తెన్నులపై మాట్లాడారు. ఈ సందర్భంగా చైర్మన్, సభ్యులు మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమమే తమ లక్ష్యమన్నారు. సదస్సులో చర్చించిన వివిధ అంశాలతో ప్రభుత్వానికి పలు సిఫారసులు చేస్తామన్నారు. చైల్డ్ రైట్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్,రాష్ట్ర ప్రభుత్వ శాఖల సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణ, చట్టాలపై ప్రాంతీయ స్థాయి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్త్రీ, శిశు, సంక్షేమ శాఖ ఆర్జేడీ జి.చిన్మయిదేవి అధ్యక్షత వహించిన ఈ సదస్సుకు క్రైం డీసీపీ వెంకటరత్నం, బచ్పన్ బచావో ఆందోళన్ స్టేట్ కో-ఆర్డినేటర్ జి. తిరుపతిరావు, విశాఖ సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రాధ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్లు, ఆరు జిల్లాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీఈవోగా బ్రహ్మాజీరావు

విశాఖ విద్య: అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యాశాఖాధికారి(డీఎస్ఈవో)గా పి.బ్రహ్మాజీరావు నియమితులయ్యారు. పార్వతీపురం మన్యం డిప్యూటీ డీఈవోగా పనిచేస్తున్న ఆయనను ఉద్యోగోన్నతి పై అల్లూరి జిల్లాలో డీఎస్ఈవోగా నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు డిప్యూటీ డీఈవోలకు, డీఈవోగా అదే విధంగా డీఈవోలకు ఆర్జేడీలుగా ప్రమోషన్ కల్పించారు.

వైఎస్సార్ సీపీని వీడే ప్రసక్తే లేదు

- జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గంగాధర్




కొయ్యూరు: తాను పార్టీ మారుతున్నట్టుగా వచ్చిన వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రీముల గంగాధర్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తాను టీడీపీలోకి వెళ్తున్నట్టుగా కొన్ని పత్రికల్లో వార్తలు వచ్చాయని, అది వాస్తవం కాదని, తనకు అలాంటి ఉద్దేశం లేదన్నారు. పార్టీ కార్యకర్తగా ఉన్న తనకు జిల్లా కార్యవర్గంలో చోటు కల్పించి ఉన్నత స్థానానికి చేర్చారని, అలాంటి పార్టీని వీడి మరే పార్టీలో చేరబోనని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

అగ్నిబాధితులకు నిత్యావసరాల పంపిణీ

కొయ్యూరు: కంతారంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు లోకుల గాంధీ తోడు ట్రస్టు సభ్యులు మంగళవారం నిత్యావసరాలు అందజేశారు. బాధితులు డొంక లక్ష్మి, షణ్ముఖ, పెదగాడి సూర్యాకాంతంలకు తోడు ట్రస్టు గౌరవ అధ్యక్షుడు లోకుల కిరణ్, ప్రధాన కార్యదర్శి ఎం. మురళీకృష్ణ, నిత్యావసర సరకులు, వంటపాత్రలు, దుస్తులు ,ఇతర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌వైస్ చైర్మన్ లోకుల రమేష్, వైస్‌చైర్మన్ గౌరినాయుడు, సభ్యులు సతీష్,శివ,రాజు,నేతలు అప్పలరాజు, చంద్రరావు, వైఎస్సార్ సీపీ నేత గాడి సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి


సమావేశంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు

సీలేరు : స్థానికంగా నూతనంగా నిర్మించబోయే పంపు స్టోరేజ్ ప్రాజెక్టుకు సంబంధించి ఇటీవల నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికులకు ఇచ్చిన హామీలను జెన్‌కో అధికారులు అమలు చేయాలని ప్రజా ప్రతినిధులు కోరారు. సర్పంచ్ దుర్గో అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మించే ప్రదేశాలలో ఉన్న వారికి అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. అయితే ఈ ప్రాంతంలో రోడ్లను నిర్మిస్తే అడ్డుకుంటున్నారని తెలిపారు. ఇలా అయితే ప్రాజెక్టు ప్రారంభించాక మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ సాంబమూర్తి, ఉప సర్పంచ్ వల్లీప్రసాద్, మాజీ సర్పంచ్ కారే శ్రీనివాస్, టీడీపీ నాయకుడు తిరుమలరావు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'కు విస్తృత ఏర్పాట్లు


ఏర్పాట్లపై సమీక్షిస్తున్న విశ్వనాథన్

విశాఖ స్పోర్ట్స్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామీణ, పట్టణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' రాష్ట్ర స్థాయి పోటీలకు విశాఖలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 9న రైల్వే స్టేడియంలో ప్రారంభ వేడుకలు జరగనుండగా రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన ఐదు క్రీడాంశాల్లో జిల్లా స్థాయి మెన్, వుమెన్ జట్లు పాల్గొననున్నాయి. ఈ సందర్భంగా జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ బ్రాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని ప్రధాన కూడళ్లలో ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో హోర్డింగ్‌లు, జెండాలు, బిల్ బోర్డ్‌లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. క్రీడాకారులు దూర ప్రాంతాల నుంచి వస్తారు కనుక వారికి స్వాగతం పలుకుతూ రైల్వే, బస్ స్టేషన్లలో వెల్‌కం కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా విశేషాలను తెలుపుతూ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. క్రీడాకారులు బస చేసే చోట నుంచి మైదానాలకు వచ్చే దారుల్లో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఉండేలా చూసుకోవాలన్నారు. ఎయిర్‌పోర్ట్ నుంచి వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం వరకు రోడ్లకి ఇరువైపులా ఆడుదాం ఆంధ్ర విశిష్టతను తెలిపే హోర్డింగులు, బిల్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. బస్సులపై ట్రాన్సిస్ట్ మోడల్‌లో స్ట్రిప్స్, జెండాలు పెట్టాలని, అందుకు అవసరమైన చర్యలు త్వరితగతిన తీసుకోవాలని పేర్కొన్నారు. బ్రాండింగ్ కమిటీలోని సభ్యులు, ఆయా జోన్ల కమిషనర్లు, రాష్ట్ర, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు సంయుక్తంగా పర్యటించి తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో శాప్ డీడీ రమణ, డీఎస్‌డీవో జూన్ గాలియట్, సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు వి.మణిరామ్, వివిధ జోన్ల కమిషనర్లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి


విజేత జట్టుకు కప్ అందిస్తున్న కమాండెంట్ రితేష్‌ఠాకూర్


వాలీబాల్ ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ రితేష్‌ఠాకూర్

చింతూరు: మారుమూల గిరిజన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు కమాండెంట్ రితేష్‌ఠాకూర్ తెలిపారు. మండలంలోని మద్దిగూడెం ఆశ్రమ పాఠశాల ఆవరణలో సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన వాలీబాల్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కమాండెంట్ మాట్లాడుతూ నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల సంక్షేమం కోసం సివిక్‌యాక్షన్ పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో సీఆర్‌పీఎఫ్ ఎనలేని సేవలు అందిస్తోందని, ప్రతికూల వాతావరణ పరిస్థితులను ఎదుర్కొని తమ జవాన్లు దేశరక్షణకు పాటు పడుతున్నారని చెప్పారు. గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడాప్రతిభను వెలికి తీసేందుకు ఆటల పోటీలు ఎంతో దోహదపడతాయని కమాండెంట్ తెలిపారు. మండలంలోని తుమ్మల, ఏడుగురాళ్లపల్లి, తాటిలంక, విద్యానగరం, మద్దిగూడెం, బొడ్డుగూడెం గ్రామాలకు చెందిన యువతకు నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో ఏడుగురాళ్లపల్లి జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఇన్ కమాండెంట్ ప్రీత, కమల్‌వీర్, అసిస్టెంట్ కమాండెంట్ హేమంత్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు చినబాబు పాల్గొన్నారు.